క్లుప్తంగా

పేదల ఇళ్లను కూల్చొద్దు



మహబూబాబాద్: పేదల ఇళ్లను కూల్చి వారి బతుకులను రోడ్డు పాలు చేయవద్దని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, శ్రావణ్, ఫాతిమా, రమేశ్, చిరంజీవి పాల్గొన్నారు.

28న లోక్ అదాలత్

మహబూబాబాద్ రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో ఈనెల 28వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాజీ మార్గం ద్వారా సమయం వృథా కాదని కక్షలు, కారుణ్యాలు తగ్గుతాయని తద్వారా స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు, నేరస్తుడు (రాజీ పడినవారు) తమ ఆధార్ కార్డు తీసుకుని కోర్టుకు రావాలని పూర్తి సమాచారం కోసం ఎస్సైలు: 87126 56931, 94417 70422, కోర్టు కానిస్టేబుల్: 89199 23205 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గుంతల పూడ్చివేత



గంగారం: మండలంలో ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఎస్సై రవికుమార్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తన సొంత డబ్బులతో గుంతల్లో మొరం పోయించి చదును చేయించాడు.

'జమిలి' విధానం రాజ్యాంగానికి విరుద్ధం

బయ్యారం: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న జమిలి ఎన్నికల విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులా మారుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. సమావేశంలో నాయకులు రాజన్న, మధు, వెంకన్న, మల్లికాంబ, శ్రీను, చంటి పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం



నర్సింహులపేట: పౌష్టిక ఆహారంతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సీడీపీఓ ఎల్లమ్మ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ మాధవి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సూపర్‌వేజర్లు శ్రీదేవి, రాణి, కవిత, ఉష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని ఉప్పలపాడు సెక్టార్‌లోగల వెంకట్రాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఘనంగా పోషణ మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సర్దార్‌బీ, డాక్టర్ సాగర్, లింగరాజు, ఏఎన్‌ఎం అరుణ, పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ

మహబూబాబాద్ అర్బన్: ఎన్‌ఎస్‌ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీం)తోనే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రా రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, అధ్యాపకులు అనిల్ కుమార్, సాంబశివరావు, మసూద్ అహ్మద్, వినోద్ కుమార్, రాజశేఖర్, హాత్తిరామ్, ఖాసీం, సుమన్, వీరన్న, సుమలత పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సేవాభావం పెంపొందించుకోవాలి

గార్ల: విద్యార్థులు చదువులతోపాటు, సామాజిక సేవాభావం పెంపొందించుకోవాలని గార్ల జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇస్లావత్ చాంప్లా సూచించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాదరావును అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, సోమన్న, జోగ్యా, సత్యనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీనివాస్, సుజాత పాల్గొన్నారు.



గార్ల: ఎన్‌ఎస్‌ఎస్ అధికారిని సన్మానిస్తున్న అధ్యాపకులు

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

నెల్లికుదురు: విద్యార్థులు చదువుతోపాటు సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఓను ఉపసంహరించుకోవాలి

కురవి/కేసముద్రం/దంతాలపల్లి: ఉపాధ్యాయుల రేషనలైజేషన్ జీఓను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాస్టి రమేష్ అన్నారు. మంగళవారం సీరోలు మండల శాఖ ఆధ్వర్యంలో బాబురావు అధ్యక్షతన కాంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌జీటీ టీచర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సజ్జనం విద్యాసాగర్, మనోహర్, సునీల్‌కుమార్, సుభాషిణి, వీరేందర్, రమేష్ పాల్గొన్నారు.

తొర్రూరు: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ప్రభుత్వం అశాస్త్రీయంగా చేపడుతుందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జినుగ విప్లవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పులి ముత్తిలింగం అన్నారు. జీఓ 25ను సవరించాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరసన తెలిపారు.



తొర్రూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నర్సింహులపేట: జీఓ 25ను సవరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు క్రాంతికుమార్, శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది

మరిపెడ రూరల్: తెలంగాణలో పేదలకు 10లక్షల ఎకరాల భూములు పంచిన ఘన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండెపుడి గ్రామంలో సీపీఎం మహాసభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంతో ఈసమంతా పాత్రలేని బీజేపీ మతోన్మాద శక్తులు తెలంగాణకు మేము వారసులమని, ఇది హిందువులు, ముస్లింలకు జరిగిన పోరాటమని, చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్వాల వీరయ్య, మండల కార్యదర్శి దుండి వీరన్న, రాజన్న, మధుసూదన్, షరీఫ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

మధ్యాహ్న భోజనంలో దొడ్డు బియ్యం



తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనంలో దొడ్డు బియ్యంతో అన్నం పెట్టిన సంఘటన మండలంలోని చెర్లపాలెం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. సివిల్ సప్లై అధికారులు ప్రతినెల పంపిస్తున్న సన్నబియ్యంలో దొడ్డు రకం వచ్చాయి. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు సైతం దొడ్డు బియ్యంతో అన్నం తయారు చేసి పెడుతున్నారు. దీంతో అన్నం తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు దొడ్డు బియ్యంతో అన్నం పెడుతున్నారని భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులతో గొడవకు దిగారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎంను వివరణ కోరగా, తమకు సివిల్ సప్లై అధికారులు ఇచ్చిన బియ్యాన్ని మాత్రమే వండి పెడుతున్నామని, అప్పుడప్పుడు కొన్ని బస్తాల బియ్యం సరిగ్గా ఉండడం లేదని తెలిపారు.

దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న వెంకన్న

నెహ్రూసెంటర్: మతోన్మాద ఫాసిస్టు శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని, మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న అన్నారు. జ్యోతిరావుపూలే స్థాపించి సత్యశోధక్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జ్యోతిరావుల పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, నాయకులు పాపయ్య, లక్ష్మయ్య, కోటేష్, జబ్బార్, కృష్ణ, మురళీ పాల్గొన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు ఉద్యమాలు అవసరం

తొర్రూరు: అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్న కుల వ్యవస్థ నిర్మూలనకు అందరూ ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. మాస్‌లైన్ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 'కుల నిర్మూలన–ఆచరణాత్మక కార్యక్రమం' అనే అంశంపై డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఓమ బిక్షపతి, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'హరివిల్లు'తో ఉత్సాహం నింపాలి



కేసముద్రం: మాట్లాడుతున్న యాదగిరి

కేసముద్రం: హరివిల్లు కార్యక్రమాన్ని అన్నిపాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల్లో ఉత్సాహం నింపాలని మండల నోడల్ అధికారి యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో రెండురోజులుగా ఉపాధ్యాయులకు హరివిల్లుపై జాయ్‌ఫుల్ లెర్నింగ్ పేరిట జరుగుతున్న శిక్షణ మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజు, ఆర్పీలు అశోక్, సురేష్‌నాయుడు, సీఆర్పీలు స్వాతి, సుల్తానా, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రాథమిక విద్యే పునాది అని నోడల్ ఆఫీసర్ రామదాసు హెచ్‌ఎంలకు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులకు హరివిల్లుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ మౌనిక అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి గిరిజన బాలుర హాస్టల్‌లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

కురవి: మతిస్థిమితం లేని వృద్ధుడిని పోలీసులు కాపాడిన సంఘటన సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మరిపెడ మండలం ఉల్లేపల్లి శివారు లూనావత్ తండాకు చెందిన బానోత్ సిరి అలియాస్ శ్రీను అనే వృద్ధుడు కొత్తూరు(సీ) శివారులోని పంటపొలాల్లో పడిపోయి ఉన్నాడు. దీంతో గ్రామానికి చెందిన వ్యక్తులు 100 డయల్ కాల్ చేశారు. స్పందించిన సీరోలు పోలీస్ స్టేషన్ బ్లూకోట్స్ కానిస్టేబుల్స్ డి.విద్యాసాగర్, డి.రాములు సంఘటనా స్థలం చేరుకొని అపస్మారక స్థితిలో బురదలో ఉన్న వృద్ధుడిని లేపారు. బురదను శుభ్రంగా కడిగారు. హోటల్ నుంచి టిఫిన్ తెప్పించి పెట్టారు. అనంతరం వృద్ధుడిని అడ్రస్ అడిగి తెలుసుకున్నారు. బంధువులకు అప్పగించారు. కాపాడిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు.



వృద్ధుడిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

వరద బాధితులను ఆదుకోవాలి

మహబూబాబాద్: ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సాయం అందక వందలాది మంది బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి యాసంగి పంటలకు సాగు నీరు అందించాలన్నారు. గత ప్రభుత్వంలో పనులు పూర్తి చేసిన వారి పెండింగ్ బిల్లులు సకాలంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యవతి రాథోడ్

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

గార్ల: అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 10ఏళ్లుగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోవడంతో, అనేక మంది ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ నుంచి ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం హర్షనీయం అన్నారు. సీహెచ్‌సీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా, మండల కమిటీ సభ్యులు కవిత, హరి, ఈశ్వర్‌లింగం, వీరస్వామి, రాజారావు, సత్యవతి, నాగమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందునూరి శ్రీనివాసరావు

సంక్షిప్త సమాచారం

మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు సన్నాహాలు

డోర్నకల్: స్థానిక మెయిన్ రోడ్డులో ఇందిరా మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా క్యాంటిన్ డోర్నకల్ రూరల్‌కు మంజూరు కాగా ఉయ్యాలవాడ గ్రూపునకు కేటాయించారు. మహిళా క్యాంటీన్‌కు సంబంధించిన భవనాన్ని మంగళవారం డీఆర్‌డీఏ బోసు రాజు, ఏపీఎం శంకర్‌నాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి తదితరులు పరిశీలించారు. ఈనెల 30న మంత్రులతో ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కార్యాలయ తరలింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లాపై వివక్ష చూపకుండా ములుగు జిల్లాకు ఆర్సీ కార్యాలయాన్ని తరలించాలనే కుట్రను వెనక్కి తీసుకోవాలని జిల్లా కేంద్రంలోని ఆర్సీఓ కార్యాలయం ఎదుట లంబాడీ హక్కుల పోరాట సంఘం, సమితి, స్టూడెంట్ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో గుగులోతు భీమానాయక్, వాసునాయక్, రమేష్, శివవర్మా నాయక్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

బయ్యారం: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్లకంటి సూర్య అన్నారు. మంగళవారం బయ్యారంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాకయ్య, లచ్చయ్య, కృష్ణ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

కురవి: ఖమ్మం జిల్లా కేంద్రంలోని వరద బాధితులకు కురవి మండల కేంద్రానికి చెందిన గంగరబోయిన రఘు అనే యువకుడు మంగళవారం రెండు గ్యాస్ స్టౌలు, ప్లేట్స్, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి వెంకన్న, చింతమల్ల యాకన్న, సంతోష్, కార్తీక్, శరత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెద్దవంగర: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు రవికుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం మండల పీఆర్టీయూ నాయకులు బాధిత కుటుంబానికి రూ.16వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్, విద్యాసాగర్, హెచ్‌ఎం శ్రీనివాస్, కళాధర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దంతాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.940లకే విద్యుత్ మీటర్ అవకాశాన్ని మీటర్ లేని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఈ నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తూర్పుతండా, దుబ్బతండా పలు గ్రామాలలో మీటర్ లేని ఇళ్లను పరిశీలించారు. ఈనెల 30 వరకు మాత్రమే గడువు ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన్, ఏఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

భ్రూణహత్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

నెల్లికుదురు: భ్రూణహత్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు ముందుండి ప్రచారం చేయాలని ఎంపీడీఓ బాలరాజు, సీడీపీఓ ఇందిరమ్మ మహిళా సంఘాల మహిళలకు వారు సూచించారు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ నందనా దేవి, ఐసీడీఎస్ విజయలక్ష్మి, చంద్రకళ, నర్మద, మల్లీశ్వరి, శ్రీదేవి, వసంత పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



మరిపెడ: మండలంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు దోమకొండ శ్రీశైలంకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో మంగళవారం పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతరావు, ఉపాధ్యాయులు రామ్మోహన్, జనార్ధనాచారి, దేవులా, నెహ్రు, స్వప్న, ప్రకాష్ పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి..

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ అర్బన్ పీహెచ్‌సీలో హెచ్‌ఈఓగా పని చేసిన ఓబిలిశెట్టి రామకృష్ణ ఇటీవల డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సబ్‌యూనిట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా అర్బన్ పీహెచ్‌సీలో మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మురళీధర్ మాట్లాడారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు..

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం విజయసుశీలను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లికుదురు: స్థానిక ఆదర్శ పాఠశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 6నుంచి 8 వరకు, 9నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకు బోటనీ సబ్జెక్ట్ బోధించడానికి అనుభవం, బీఏ టీపీటీ, ఎంఎస్సీ బోటనీ ఉత్తీర్ణులై బీఈడీ ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26న ఆదర్శ పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

పాషన్నకు నివాళి

బయ్యారం/మహబూబాబాద్ రూరల్: విడిపోయిన విప్లవకారులందరూ ఐక్యంగా నూతన ప్రజాస్వామిక విప్లవమే లక్ష్యంగా పోరాడటం ద్వారానే అమరుడు ముఖ్తార్ పాషన్నకు నిజమైన నివాళి అని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బయ్యారంలో పాషా వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, మధు, సత్యనారాయణ, సీతారామయ్య, దేవేందర్, శ్రీధర్, పద్మ, శ్రీశైలం పాల్గొన్నారు. న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం ఆధ్వర్యంలో పాషన్న వర్ధంతి సందర్భంగా బయ్యారంలో ర్యాలీ నిర్వహించారు.

లయన్స్ తరుణి సేవలు అభినందనీయం

తొర్రూరు రూరల్: లయన్స్ సేవా తరుణి సంస్థ నిరంతరం అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని హెచ్‌ఎం ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాటేడు జిల్లా పరిషత్ పాఠశాలలో పెరుమాండ్ల రమేష్‌గౌడ్–స్వాతి దంపతుల కుమార్తె అశ్రిత జన్మదినాన్ని పురస్కరించుకొని నోటు పుస్తకాలు, టై, బెల్ట్‌లు, పెన్నులు అందించారు.

క్రైం కార్నర్..

22క్వింటాళ్ల నల్లబెల్లం సీజ్



నెల్లికుదురు: అక్రమంగా నిల్వచేసిన రూ.2.40లక్షల విలువ చేసే 22క్వింటాళ్ల నల్లబెల్లం, 2క్వింటాళ్ల పటిక బెల్లం సీజ్ చేసిన సంఘటన మండలంలోని జామతండా శివారు శంకర్ నాయక్‌తండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. జామతండా శివారు అవులేగతండాకు చెందిన గుగులోతు నరేష్, నల్లగుట్ట తండాకు చెందిన బానోతు బాలు చిత్తూరు నుంచి నల్లబెల్లం తీసుకువచ్చి తండాల్లో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం మేరకు శంకర్‌నాయక్ తండాలో సోదాలు చేయగా తండాకు చెందిన గుగులోతు సుమన్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

గంగారం: గుర్తు తెలియని వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకోవడంతో బియ్యం అక్కడే వదిలేసి పరారైన సంఘటన మడగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై రవి కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మడగూడెం గ్రామం నుంచి రేషన్‌బియ్యాన్ని టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చేలోగా బియ్యాన్ని అక్కడే వదిలేసి అదే వాహనంతో పరారయ్యారు. పోలీసులు వచ్చి బియ్యాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సు, ట్రాలీఆటో ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్: ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నాంచారీమడూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వర్ధన్నపేట మండలంలోని పంథిని గ్రామానికి చెందిన పూర్ణచందర్, సంతోష్ అనే వ్యక్తులు తమ ట్రాలీ ఆటోలో తొర్రూరులో జరిగిన సంతకు వచ్చి గొర్రెలను తీసుకెళ్తున్నారు. నాంచారీమడూరు గ్రామ శివారులోకి వెళ్లే సరికి వరంగల్ నుంచి తొర్రూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీక్కొన్నాయి. దీంతో డ్రైవర్ పూర్ణచందర్ కాళ్లకు, మరో వ్యక్తి సంతోష్ తలకు తీవ్రగాయాలు కాగా, వెంటనే 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మరిపెడ రూరల్: ఓ యువకుడు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. ఇటీవల మండలంలోని చిల్లంచర్ల గ్రామానికి చెందిన ఓ యువతీని ప్రేమ పేరుతో కొంత కాలంగా మహేష్(20) వేధిస్తున్నాడు. దీంతో ఈనెల 22న యువతీ కుటుంబ సభ్యులు మహేష్‌పై దాడి చేసి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన మహేష్ ఈనెల 22న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్లే శాతవాహన రైలులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ కానిస్టేబుల్ గాంధీ మంగళవారం తెలిపారు. సదరు వ్యక్తి రైలులోని సీటుపై పడుకుని ఉండి మృతిచెందగా తోటి ప్రయాణికులు జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్రపరిచామని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఎవరైనా గుర్తుపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోళ్లపై విష ప్రయోగం?



మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామ శివారులో గల ఇస్లావత్ సుశీలకు చెందిన వీరభద్ర పౌల్ట్రీ ఫాం లో మంగళవారం ఒకేసారి 300లకు పైగా కోళ్లు చనిపోయాయి. కోళ్లపై విష ప్రయోగంతో చనిపోయి ఉంటాయని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన సంఘటనపై కురవి పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేయనున్నామని బాధితులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెహ్రూసెంటర్: దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వీర భవన్‌లో సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. మోదీ పాలనలో దళితులను భూముల నుంచి వెళ్లగొడుతున్నారని, సొంత భూములున్న దళితులకు సాగునీరు కరువైందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకన్న, సాంబలక్ష్మి, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరాకుల పాల్, జిల్లా కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక



పెద్దవంగర: మండలంలోని గత రెండేళ్లలో జరిగిన వివిధ రకాల అభివృద్ధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ రెండో రోజు ముగిసింది. మంగళవారం మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం పర్యటించి పనులపై తనిఖీ నిర్వహించారు. 2023 ఏప్రిల్ 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన తనిఖీల్లో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, మన ఊరు–మన బడి పనుల్లో అవకతవకలు జరిగినట్లుగా అధికారులు నిర్ధారించారు. రూ.9కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా రూ.7.15లక్షలు లెక్కల్లో తేడాను గుర్తించారు. వారినుంచి రూ.7.15లక్షలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శాంతకుమారి, ఎంపీడీఓ వేణుమాధవ్, అధికారులు అంబుడ్స్, నవీన్, సాయి జ్ఞానేందర్ పాల్గొన్నారు.